వార సంతకు రహదారే దిక్కు

రహదారిపైనే కొనసాగుతున్న వారసంత

- రాకపోకలకు అంతరాయం
- క్రయ విక్రయదారులకు అవస్థలు
- ఆదాయం వస్తున్నా స్థలం చూపని పాలకులు

ధర్మారం, డిసెంబర్1 : ధర్మారంలోని కరీంనగర్– రాయపట్నం రాష్ట్ర రహదారిపై ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న వారసంతతో రాకపోకలకు అంతరాయం కలుగుతున్నది. అదే సమయంలో వాహనాల రాకపోకలతో వారసంతకు వచ్చే క్రయవిక్రయదారులకు సైతం ఇబ్బందులు కలుగుతున్నాయి. పంచాయతీ పాలకవర్గాలు వారసంతకు ప్రత్యామ్నాయ సౌకర్యం కల్పించడంలో విఫలమవుతున్నాయి.ధర్మారంలో 1981 లో వారసంత ఏర్పాటైంది. అప్పటి పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో కూరగాయల సంత ఏర్పడింది. దీంతో పంచాయతీకి ఏటా కొంత ఆదాయం వచ్చేది. చిన్నగా మొదలైన ఈ సంత ఏటేటా విస్తరిస్తున్నది. చిరు వ్యాపారుల సంఖ్య కూడా పెరుగతూ వస్తున్నది. బట్టల వ్యాపారం విస్తరించింది. పంచాయతీకి ఏటా రూ. లక్షల్లో ఆదాయం వస్తున్నది. ఈ వారసంతకు ధర్మారం మండలంతో పాటు కరీంనగర్, చొప్పదండి, జూలపల్లి, పాలకుర్తి, ఎండపల్లి, గొల్లపల్లి, జగిత్యాల, మంచిర్యాల తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులతో పాటు కొనుగోలుదారులు కూడా పెద్ద సంఖ్యలో వస్తున్నారు. రాష్ట్ర రహదారితో పాటు సమీపాన ఉన్న గణేశ్ నగర్ లోని వీధికి విస్తరించింది. ప్రధాన రహదారిపై కూరగాయలు విక్రయిస్తుండగా, గణేష్ నగర్ వీధిలోని రోడ్డుపై బట్టల వ్యాపారం నిర్వహిస్తున్నారు. ప్రతీ వారం వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గణేష్ నగర్ వీధిలో బట్టల వ్యాపారాలు సాగుతుండడంతో ఆ ప్రాంతంలోని వారు తమ ఇండ్లకు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతున్నది. ఈ రోడ్డు చిన్నదిగా ఉండడంతో కాలినడకన వెళ్లడం కూడా కష్టమవుతున్నది. ప్రస్తుతం ఈ సంతతో పంచాయతీకి ఏటా లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా పాలకవర్గాలు మాత్రం శాశ్వత సంత ఏర్పాటుకు ఆలోచన చేయడం లేదు. కరీంనగర్ –రాయపట్నం రహదారిని ఫోర్‌లేన్‌గా విస్తరించనున్న నేపథ్యంలో వారసంతకు కచ్చితంగా ప్రత్యామ్నాయ స్థలం చూపాల్సిన అవసరం ఉన్నది. అధికారులు స్పందించి వారసంతకు శాశ్వత పరిష్కారానికి ప్రత్యామ్నాయ స్థలం చూపించి ఇబ్బందులు తొలగించాలని చిరు వ్యాపారులు, కొనుగోలుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ స్థలం లేకనే

ప్రత్యామ్నాయ స్థలం లేక పోవడంతో విధిలేని స్థితిలో రోడ్డుపై వారసంత నిర్వహించాల్సి వస్తున్నది. గతంలో పంచాయతీ పాలక వర్గాలు వార సంతకు స్థలం కేటాయించ లేదు. వారసంతకు ప్రత్యామ్నాయ స్థల కేటాయింపుపై అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

రవి,పంచాయతీ కార్యదర్శి, ధర్మారం

పెద్ద 'బడి' చిన్నబోతున్నది..

- ఒకే ప్రాంగణంలో నాలుగు కట్టడాలు..
- పాఠశాల ఆవరణలో పాడుపడ్డ భవనాలు..
- కళ తప్పిన క్రీడా మైదానం..
- ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు...
- మసక బారుతున్న 54 ఏండ్లనాటి చరిత్ర..

బాలుర పాఠశాల ఆవరణలో పనికిరాని పాడుపడ్డ పాత భవనాలు

జూలపల్లి, డిసెంబర్ 1 : జూలపల్లిలో ఏండ్ల తరబడిగా అందరూ ముద్దుగా పిలుచుకునే పెద్ద 'బడి' చిన్నబోతుంది. దాదాపు 54 ఏండ్ల నుంచి వేల మంది విద్యార్థులకు అక్షరజ్ఞానం అందించిన సరస్వతీ నిలయం మసక బారుతుంది. ఎంతో మంది ఆటగాళ్లకు క్రీడా స్ఫూర్తినింపిన పాఠశాల మైదానం కళ తప్పి క్రమంగా ఉనికి కోల్పోతున్నది. 4.2 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పాఠశాల ప్రాంగణంలో ఓ వైపు పగుళ్లు పడి పెచ్చులూడుతున్న పాడుపడ్డ భవనాలు, పని చేయని మరుగుదొడ్లు, మరోవైపు ప్రభుత్వ కళాశాల, మంచినీటి ట్యాంక్, రెవెన్యూ శాఖకు చెందిన వర్షపాతం నమోదు కేంద్రం, సిమెంట్ పైపుల నిల్వలు, చెత్తా చెదారం నిండి పాఠశాల ఆవరణ నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నది. వెరిసి క్రీడా మైదానం విస్తీర్ణం తగ్గి విద్యార్థులు, క్రీడాకారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. జూలపల్లి మండల కేంద్రంలో 1950లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. 1969 వరకు ఆరో తరగతి నుంచి హెచ్ఎస్సీ (పదకొండో తరగతి) దాకా తరగతులు నిర్వహించారు. ఆ తర్వాత 6 నుంచి పదో తరగతి వరకు విద్యా బోధన కొనసాగిస్తున్నారు. నాడు దాదాపు 5 వందల విద్యార్థులతో కళకళలాడిన పెద్ద బడి నేడు సమస్యలతో కొట్టుమిట్టాడుతూ కేవలం 90 మందికి పరిమితమై వెలవెలబోతుంది.

పాడుపడ్డ భవనాలు ..

అప్పట్లో మండల రెవెన్యూ, మండల ప్రజాపరిషత్ కార్యాలయాల భవనాలతోపాటు, ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించడానికి ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకుండా పోయింది. కొంత కాలం అద్దె భవనంలో కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత పాఠశాల ఆవరణలో ఉన్న అదనపు తరగతి గదులను కార్యాలయాలు, కళాశాలకు అప్పగించారు. దీంతో గతంలో గ్రామస్తులు ఏకమై వేరే చోట మండల కార్యాలయాలకు ప్రైవేటు స్థలాలు కొనుగోలు చేయగా, పక్కా భవనాలు నిర్మించి కార్యాలయాలు తరలించారు. కాని పాఠశాల ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇక్కడే భవనం నిర్మించారు. ఆలనా పాలనా లేక అప్పటి నుంచి అదనపు తరగతి గదులు కాలక్రమేనా పూర్తి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. కొంత మంది మలమూత్ర విసర్జనకు వాడుకోవడంతోపాటు, మందు బాబులకు అడ్డగా మారింది. మరో వైపు దాదాపు మూడు కోట్ల నిధులు ఖర్చు చేసి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించి భవన సముదాయం నిర్మించారు. కళాశాల పక్కన మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీటి ట్యాంక్ నిర్మించారు. మరో వైపు రెవెన్యూ శాఖకు చెందిన వర్షపాత నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు. ఏండ్లు గడుస్తున్నా రెవెన్యూ అధికారులు ఆ కేంద్రాన్ని తరలించడం లేదు. తెలంగాణకు హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరగడంతో వాటి కింద కొంత మంది పశువులను కట్టేసి కొట్టంలా మార్చుకుంటున్నారు. పాఠశాల ఆవరణలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం సూచిక బోర్డు ఓ మూలన నిర్లక్ష్యంగా కింద పడేయగా, మరో దిక్కు సిమెంట్ పైపులు నిల్వ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వేర్వేరుగా ఉన్న ఇనుప గేట్లు విరిగి పోయాయి. విద్యా సంస్థలకు రక్షణ లేక ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా మార్చుకుంటున్నారు.

ఇరుకైన క్రీడా మైదానం..

పాఠశాల ఆవరణలో విచ్చలవిడిగా నిర్మాణాలు చేపట్టడంతో క్రీడా మైదానం ఇరుకుగా మారింది. ఎంతో మంది ఆటగాళ్లకు స్ఫూర్తినింపిన క్రీడా మైదానం ప్రస్తుతం విస్తీర్ణం తగ్గి కళ తప్పి బోసిపోతుంది. ఆట స్థలం అనువుగా లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డి, రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షటిల్, బ్యాడ్మింటన్ లాంటి ఆటలకు దూరవుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జూలపల్లి వాలీబాల్ జట్టుకు మంచి గుర్తింపు ఉంది. ఈ మైదానంలో ప్రతి రోజూ విద్యార్థులు, క్రీడాకారులు క్రమం తప్పకుండా శిక్షణ పొందుతున్నారు. కనీస సౌకర్యాలు లేకున్నా ఆత్మస్థైర్యంతో క్రీడాల్లో రాణిస్తూ వన్నె తెచ్చారు. రాష్ట్ర, జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఎన్నో పతకాలు సాధించారు. వాలీబాల్ ఆటలో మక్కువ పెంచుకుని పట్టుబట్టి రాటుతేలిన అణిముత్యాలాంటి క్రీడాకారులు దాదాపు 30 మంది పోలీస్ శాఖలో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. పనికిరాని పాడుపడ్డ భవనాలు, వర్షపాతం నమోదు కేంద్రం తొలగిస్తే క్రీడలకు సౌకర్యంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

కరువైన పరిశుభ్రత..

పాఠశాల ఆవరణలో పరిశుభ్రత కరువైంది. అధికారులు పారిశుధ్యం నిర్వహనపై ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మద్యం సీసాలు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లు, నరికేసిన చెట్ల మొదళ్లు, కొమ్మలు, పెంట కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెట్లకింద గడ్డి కుప్పలు పెట్టి పశువులు కట్టేసి కొట్టంలా వాడుకుంటూ పాగా వేశారు. పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి, బహిరంగ మలమూత్ర విసర్జనతో పరిసర ప్రాంతాలు కంపు కొడుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సర్కార్ పాఠశాల ఉనికి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కేసీఆర్ అంటేనే ఒక చరిత్ర

సినిమా తిలకిస్తున్న కోరకంటి చందర్, నాయకులు

కోల్‌సిటీ, డిసెంబర్ 1: కేసీఆర్ అంటేనే ఒక చరిత్ర... తెలంగాణను దేశానికే దిక్సూచిగా తీర్చిదిద్దిన గొప్ప నేత అని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ కొనియాడారు. తెలంగాణలోని ప్రతి బిడ్డ చూడదగిన సినిమా కేసీఆర్ (కేశవ చంద్ర రమావత్) చిత్రమని ఆయన అన్నారు. గోదావరిఖనిలోని రాజేశ్ థియేటర్‌లో ఆదివారం పార్టీ కార్యకర్తలతో కలిసి 'కేసీఆర్' సినిమాను వీక్షించారు. సినిమా చూస్తూ భావోద్వేగానికి లోనైన చందర్ తెలంగాణ కోసం సాగిన ఉద్యమ జ్ఞాపకాలను కార్యకర్తలతో పంచుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బోధన పద్ధతులపై అవగాహన

పాల్గొన్న అధ్యాపకులు

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 1 : నూతన బోధన పద్ధతులతో విద్యార్థుల్లో మరింత నైపుణ్యాలను పెంచవచ్చని ఎన్‌బీఏ చీఫ్ ఆఫీసర్ వంశీకృష్ణ అన్నారు. పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ బోర్డు ఆఫ్ అక్రెడిటేషన్ (ఎన్‌బీఏ) ఆధ్వర్యంలో అధ్యాపకులకు ప్రత్యేక ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ)ని నిర్వహించారు. ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి కార్యాచరణలో కొత్త బోధన పద్ధతులను పరిచయడం చేయడం,అధ్యాపకులకు సమగ్ర శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సాంకేతిక, శాస్త్రీయ, సాంఘీక దృష్టి కోణాలను అనుసరించి విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగుపర్చడం సాధ్యమవుతుందన్నారు. ఇక్కడ కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎం. గణేశ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేశ్, డాక్టర్ నటరాజన్, డాక్టర్ ఆరిఫ్, ప్రభాకర్, స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అద్భుతం భారత రాజ్యాంగం

కోల్‌సిటీ, డిసెంబర్ 1: దేశ ప్రజలకు దిక్సూచి భారత రాజ్యాంగమని, మన రాజ్యాంగం ప్రపంచంలోనే అద్భుతమని మధ్యప్రదేశ్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ, ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఐఏఎస్ పరికిపండ్ల నరహరి పేర్కొన్నారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్టు, ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖనిలోని మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్ విగ్రహాలకు సంఘం నాయకులతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పూలే అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి వారం క్రమం తప్పకుండా అంబేద్కర్, పూలే పేరిట జ్ఞానమాల కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. అంబేద్కర్ సంఘం జాతీయ కో–ఆర్డినేటర్ వరుణ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, ఉపాధ్యక్షులు మైస రాజేష్, సింగరేణి మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్‌కుమార్, వన్ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు పంపిణీ

పాలకుర్తి, డిసెంబర్1: బసంత్ నగర్‌లోని ఆలయఫౌండేషన్ ట్రైనింగ్ సెంటర్‌లో కుట్టు శిక్షణ పొందిన 30 మంది మహిళలకు ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఎస్బీఐ కరీంనగర్ సహకారంతో గత అక్టోబర్ నుంచి ఆలయఫౌండేషన్ కార్యాలయంలో నెలరోజులపాటు కుట్టులో శిక్షణ ఇప్పించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరహరి తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ పరికిపండ్ల రాము, నరహరి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నేడు నర్సింగ్ కళాశాల ప్రారంభం

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 1: రామగుండంలోని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్)లో నూతనంగా మంజూరైన నర్సింగ్, పారా మెడికల్ కళాశాలలను సోమవారం ఉదయం 11గంటలకు వర్చువల్ ద్వారా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించనున్నారు. నర్సింగ్ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికి రూ. 26 కోట్లను మంజూరు చేసింది. ఈ ప్రాంభోత్సవానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, కలెక్టర్ కోయ హర్ష పాల్గొనున్నారు.

సన్మానం

నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న రఘువీర్ సింగ్

జూలపల్లి, డిసెంబర్ 1: జూలపల్లిలోని రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద గీతా పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీ సభ్యులను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ గ్రామ కమిటీ అధ్యక్షుడు అమరగాని పర్శయ్య, ఉపాధ్యక్షుడు బొంగాని రమేశ్, ప్రధాన కార్యదర్శి భూసారపు మహేందర్, కోశాధికారి అమరగాని పురుషోత్తం, సభ్యులు మడక పర్శరాములు, అమరగాని కొమురయ్య, అమరగాని పర్శరాములు, అమరగాని మల్లేశం, అమరగాని చంద్రయ్య, అమరగాని మల్లేశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిరసన

జూలపల్లి, డిసెంబర్ 1 : జూలపల్లిలోని ఎమ్మార్వీ భవన్ ఆవరణలో ఆదివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు.సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజుల్లో ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం గడుస్తున్నా ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ జేఏసీ మండల అధ్యక్షుడు సతీశ్, సీసీవో కోడూరి మధు, ఎంఐసీ ప్రియాంక, సీఆర్పీ తిరుమల, ఐఈఆర్పీ అనిల్, మారం బాలయ్య పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కార్యవర్గం

జూలపల్లి, నవంబర్ 1 : పెద్దాపూర్‌లో ఆటో యూనియన్ కార్యకర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బొజ్జ అంజయ్య, ఉపాధ్యక్షుడిగా రంగు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పెసరు స్వామి, కోశాధికారిగా గుర్రం స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా పూరెల్ల మహేశ్, సీపెల్లి అంజయ్య, పెసరు శ్రీనివాస్, బొడ్డు మధుకర్, సయ్యద్ ఇస్మాయిల్‌ను నియమించారు.

ఎమ్మెల్సీగా అవకాశం కల్పించండి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

పెద్దపల్లి, డిసెంబర్1: పట్టభద్రుల, నిరుద్యోగ యువత, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శాసన మండలిలో గళం వినిపించే అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో గ్రాడ్యుయేట్లతో కలిసి భారీ బైక్ ర్యాలీగా తీశారు. అనంతరం ఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా చాక్ పీస్ పట్టి ఎందరో విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలిచేందుకు కృషి చేశానని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించానని చెప్పారు. గ్రాడ్యుయేట్, నిరుద్యోగుల సమస్యలను పెద్దల సభలో వినిపించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ ఉద్యోగానికి రాజీనామా చేసి, ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు మీ ముందకు వచ్చానని, ఆశీర్వదించాలని కోరారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ మెదక్ జిల్లాలో పర్యటిస్తూ పట్టభద్రులు, నిరుద్యోగ యువత, ఉద్యోగుల సమస్యల తెసుకున్నానని, తనను ఆశీర్వదించి శాసన మండలికి పంపిస్తే సమస్యల పరిష్కారం కోసం అహర్నిషలు కృషి చేస్తానని చేస్తానన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో జిల్లా పరిధిలోని పట్ట భద్రులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

వేదికపై పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం

కమాన్‌పూర్, డిసెంబర్ 1 : కమాన్‌పూర్ జడ్పీహెచ్ఎస్ (6వ తరగతి నుంచి 10వ తరగతి)లో 1993–98 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని స్థానిక మహాలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుదీర్ఘకాలం తర్వాత తమ సహచర విద్యార్థులను కలుసుకున్న వారంతా ఒకరి యోగక్షేమాలు మరొకరు కనుక్కొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను సత్కరించారు. అప్పటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఆట–పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. పాఠశాల అభివృద్ధికి తమవంతుగా చేయూత నివ్వడానికి తీర్మానించుకున్నారు.

వ్యాస రచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మంథని, డిసెంబర్ 1: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంఈవో లక్ష్మి, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో మంథని జడ్పీహెచ్ బాలుర పాఠశాలకు చెందిన సాత్విక్ రాజ్ ప్రథమ, ఆదిత్య తేజ ద్వితీయ, జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలకు చెందిన సాయిచరణ్ తృతీయ బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్1: ప్రజాపాలన విజయోత్సవాలు ఎడ్యుకేషన్ డే కార్యక్రమంలో భాగంగా కాల్వశ్రీరాంపూర్ హైస్కూల్ లో ఆదివారం 'పునరుద్ధరించే ఇంధన వనరుల వినియోగం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో పెగడపల్లి హైస్కూల్ కు చెందిన పి రశ్మిత ప్రథమ బహుమతి, పీ చరణ్ కాల్వశ్రీరాంపూర్ జడ్పీ హైస్కూల్, కే గ్రీష్మ కూనారం హైస్కూల్ విద్యార్థులు బహుమతులు సాధించారు. విద్యార్థులను ఎంఈవో సిరిమల్ల మహేశ్ అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సునీత, కాంప్లెక్స్ హెచ్ఎం కోటేశ్వర్‌రావు ఉన్నారు.

సుల్తానాబాద్ రూరల్, డిసెంబర్ 1: సుల్తానాబాద్ ఎమ్మార్వీలో ఎంఈవో రాజయ్య ఆధ్వర్యంలో ప్రజా పాలన విజయోత్సవంపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన జశ్విత ప్రథమ, .సాత్విక ద్వితీయ, డీ శ్రీనిధి తృతీయ బహుమతి అందుకున్నారు. వీరికి ఎంఈవో బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు. డీ సురేశ్, వీ లక్ష్మణ్, వేగోళం తిరుపతి, వి.సదానందం, వి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

4న పెద్దపల్లిలో యువ వికాసం

సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు, నాయకులు

- సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పెద్దపల్లి, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): ఈ నెల 4న పెద్దపల్లిలోని రంగంపల్లి సబ్ స్టేషన్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభను యువ వికాసం పేరిట నిర్వహించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి సభా స్థలిని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రొటోకాల్ ప్రజా సంబంధాల ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 4న పెద్దపల్లి వేదికగా నిరుద్యోగ యువతతో యువశక్తి విజయోత్సవ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రూప్ 4 అభ్యర్థులు, ఇతర పోటీ పరీక్షల్లో ఎంపికై ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తామని వెల్లడించారు. తాజాగా ప్రభుత్వం రైతు రుణమాఫీకి రూ. 2740కోట్లు విడుదల చేసి, మరో మూడు లక్షల రైతులకు రుణమాఫీ పూర్తి చేసిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ముఖ్యమంత్రి సభకు పెద్ద ఎత్తున రైతులు, యువత మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని, స్థానిక ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, పెద్దపల్లి, రామగుండం, మానకొండూర్ ఎమ్మెల్యేలు విజయ రమణారావు, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, కవ్వంపల్లి సత్య నారాయణ, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లు పమేలా సత్పతి, సందీప్ కుమార్ ఝా, బీ సత్య ప్రసాద్, కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు డీ వేణు, జే. అరుణశ్రీ, పోలీస్, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇరిగేషన్, పౌరసరఫరాలపై మంత్రి సమీక్ష

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ , జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. పెద్దపలి జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రొటోకాల్ ప్రజా సంబం ధాల ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ తో కలిసి ఆయన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పౌరసరఫరాల శాఖ విభాగం పై ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లతో ఎస్ఐ

విధుల్లో చురుకుదనం చూపించాలి

కమాన్‌పూర్, డిసెంబర్ 1: విధుల్లో చురుకుదనం చూపించాలని కమాన్‌పూర్ ఎస్ఐ కొట్టె ప్రసాద్ అన్నారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకొని ఆదివారం కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా వచ్చిన కానిస్టేబుళ్లు ముత్తె ప్రకాశ్, కందుకూరి వంశీకృష్ణ, జొన్న రాజేశ్, నర్మెట వినోద్, కల్లెపల్లి శ్రీనాథ్, పీర్ల సరిత, సంగీత, జాస్నవిలు ఎస్ఐ కొట్టె ప్రసాద్‌కు విధుల్లో జాయినింగ్ లెటర్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నేరాలను అరికట్టడంలో పోలీస్ విధుల పట్ల ఆయన సలహాలు సూచనలు చేశారు.

ఆదివరాహ స్వామి క్షేత్రంలో భక్తుల సందడి

కమాన్‌పూర్, డిసెంబర్ 1: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీ ఆదివరాహ స్వామి క్షేత్రంలో ఆదివారం కార్తీక మాసం చివరి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శనంకు తరలివచ్చారు. అభిషేకం, అర్చనలతో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారితోపాటు భూదేవి, శ్రీదేవి ఉత్సవ విగ్రహాల వద్ద హారతి తీసుకొని భక్తులు